# ముత్యాలముగ్గు

పాలకూర సీతాలత

భజగోవిందం ఆరోజు ఏడుస్తూ ఏడ్చుకుంటూ నా సీటు దగ్గరకు వచ్చాడు.

"ఒరేయ్... రేయ్... హరి... హరిగోవిందం... నీతో... పనిపడింది..." అన్నాడు ఏడుస్తూ.

నాకు చిరాకేసింది. ఇలా మధ్యమధ్యలో ఏడుస్తూ మాట్లాడటంలో మాటలు విరిచేస్తున్నాడు. వాటేవి అతికించి అర్థం చేసుకోడం నా తరంకాదు. "ముందు ఏడ్చెయ్యి. తర్వాత చెప్పు... లేదా ముందు చెప్పెయ్యి... తర్వాత ఏడ్వు. నాకు ఇలా మిడిల్ మిడిల్ ఏడ్పడాలు వినిపెయ్యవు" అన్నాను కోపంగా.

వాడి ముఖంలోకి చూశాను. ముఖం సరిగ్గా కన్పించలేదు. శరీరం అంతా బాగానే కనబడుతోంది. ముఖానికి ఏమైంది? సడన్‌గా దృష్టిదోషం వచ్చిందా? అందుకే కళ్ళజోడు తీసి చొక్కా చివర బరబరా అద్దాన్ని రుద్దాను.

వాడికి నా ఆలోచన తెలిసినట్లుంది.

"నీకు దృష్టిదోషం రాలేదు... నువ్వు కోప్పడ్డావని ముఖం చిన్నబుచ్చుకున్నాను. అందుకే చిన్నదైపోయిన ముఖం నీకు కనపడలేదు" అన్నాడు భజగోవిందం.

కళ్ళజోడు పెట్టుకున్నాను.


"సరే... ఏం పని పడిందో చెప్పి ఏడు..." అన్నాను చిరాగ్గా.

"ఒక వంద రూపాయలు... అప్పు..." అన్నాడు ఆ తర్వాత గట్టిగా ఏడ్వసాగాడు.

కంగారుపడ్డాను.

"ఏమైందిరా నీకు... అప్పు ఇయ్యనని అనలేదుకదా... ఎందుకు ఏడుస్తున్నావు?" అన్నాను.

వాడు, నేను ఒకే కాలేజీలో చదివాం. ఒకే ఆఫీస్‌లో ఉద్యోగం అఘోరిస్తున్నాం. అందుకే మేం ఇద్దరం చనువుగా వుంటాం. వాడు పెళ్ళి చేసుకున్నాడు. నేను చేసుకోలేదు. అదే తేడా. తరచు వాడు నా దగ్గర ఇలా అప్పు తీసుకుంటాడు. బ్రహ్మచారిని కనుక ఎక్కువ ఖర్చులేని నేను వాడిని ఇలా ఆదుకుంటాను.



ముగ్గు: డి.విజయదుర్గ (హైదరాబాద్),

"అప్పు తప్పకుండా ఇస్తావని నాకు తెలుసు. ఏం పని పడిందో చెప్పి ఏడవమన్నావు కదా..." పని చెప్పాను అందుకే ఏడుస్తున్నాను..." అన్నాడు.

"చాల్లే.. ఆపు... ఆ డబ్బు ఎందుకో చెప్పు" అన్నాను.

"ఏముంది? సంక్రాంతి వస్తోందిగా... అందుకే ఖర్చు..." అన్నాడు భజగోవిందం.

"ఏం... బట్టలు కొనాలా?"

"కాదురా... ముగ్గు... ముగ్గు పిండి కొనాలి..."

ఆశ్చర్యపోయాను. ముగ్గుపిండి కొనడంకోసం వంద రూపాయలా?

"హరి . గోవిందం... అలా ఆశ్చర్యపోకు... గుడ్లు తేలెయ్యకు... టపా కట్టేశావని అనుమానించాల్సి వస్తుంది. ఈ వంద రూపాయలతో ఈ సంక్రాంతి వెళ్తే గొప్పే" అన్నాడు వాడు.


"ఎందుకురా ముగ్గులు... కడుపు నిండనా పాడా... అయినా మరీ ఇంత ఖర్చా?"

"ఈ సందేహం నాకూ వుంది. కానీ మా ఆవిడ ముందు నోరు విప్పలేను... సంక్రాంతి సీజన్లో రోజూ కొంపముందు ముగ్గులు పెడతారు కదా... మా ఆవిడది కాస్త భారీ చెయ్యి... ఏపని చేసినా ఇలాగే చేస్తుంది. చిన్నప్పటి నుంచీ ఆమెకు ముగ్గులంటే చచ్చేంతసరదా... మా 'ముత్యాల వీధి'లో అందరికంటే పెద్ద ముగ్గులు, ఎక్కువ ముగ్గులు పెట్టి గత సంవత్సరం 'ముగ్గులరాణి' అవార్డు కొట్టేసింది. ఈ ఏడు కూడా ఆ అవార్డు తనకే రావాలని ఆమె ప్రయత్నం... అందుకే వంద రూపాయల ముగ్గుపిండి..."

"ఇంతింత డబ్బు ముగ్గుకోసం ఖర్చు చెయ్యడం అన్న విషయం జీర్ణించుకోలేక పోతున్నాను. అలా జీర్ణించుకోలేక పోవడంవల్ల కడుపునొప్పి వచ్చింది. గట్టిగా కడుపు పట్టుకున్నాను. ఆ నొప్పి భరించడం కంటే చచ్చిపోవడం మేలని తోచి టేబుల్‌మీదవున్న పేపర్ వెయిట్‌తో నుదురు కొట్టుకోసాగాను. నా ప్రయత్నం ఆపాడు భజగోవిందం.

"ఇలాంటి పన్లు చెయ్యకురా... నువ్వు చచ్చిపోతే నాకు తరుచు అప్పు ఎవడిస్తాడురా?" అంటూ బాధపడిపోయాడు.

వెంటనే వాడికి వంద రూపాయలు ఇచ్చాను. పేపర్ వెయిట్‌తో కొట్టుకోవడంవల్ల నుదిటిమీద హిమాలయాలంత ఎత్తుగా బొప్పి కట్టింది. అదీ




మంచిదే అయ్యింది. ఆ సాయంత్రం వానలో రోడ్డుమీద నడుస్తూ కూడా హాయిగా సిగరెట్ కాల్చుకోగలిగాను. ఈ బొప్పికారణంగా సిగరెట్ తడవలేదు. మరీ వాన ఎక్కువగా వుండడంవల్ల రోడ్డు పక్కగామున్న ఒక దుకాణంలోకి వెళ్ళాను. అదొక ట్రాన్స్‌పోర్టు కంపెనీ. అక్కడ భజగోవిందం కనిపించాడు.

“ఇదేవిట్రా... ఇక్కడున్నావు? నాకు తెలియకుండా నీకు బదిలీగాని అయిపోయిందా? సామాను తీసుకెళ్ళడానికి లారీ మాట్లాడుకుందుకు వచ్చావా?” అన్నాను.

“హి...హి...” అన్నాడు వాడు పళ్ళికిలిస్తూ.

“గారపళ్ళు బయటపెట్టకు. అసహ్యం వేస్తుంది. మవ్వు ఏ కంపెనీ టూత్‌పేస్టువాడికో చెప్తే వాడొచ్చి నీచేత ప్రకటన ఇప్పించుకుంటాడు. నీ పళ్ళని క్లోజప్‌షాటో తీసి “మా టూత్‌పేస్టు వాడని వ్యక్తి పళ్ళు చూడండి... మీరు కూడా వాడకపోతే మీ గతీ ఇంతే...” అని పుస్తకాల్లో వేసుకుంటాడు...” అన్నాను.

మళ్ళీ వాడు ముఖం చిన్నబుచ్చుకున్నట్లున్నాడు. అందుకే నేను కళ్ళజోడు తీసి తుడుచుకోలేదు.

“అది కాదురా... ఇంటికి ముగ్గు పిండి తీసుకువెళ్ళాలి కదా... ఎన్ని రిక్షాలు కట్టించమా? అందుకే ఏకంగా ఒక లారీ మాట్లాడదామని వచ్చాను.” వర్షం తగ్గడంతో వాడినలా వదిలి నేనొచ్చేశాను.

ఆ మర్నాడు భజగోవిందం సంతోషంతో అపుడే మూనెలో వేసిన పూరీలా పొంగిపోతూ వచ్చాడు. వాడి ముఖం కాంతితో వెలిగిపోతోంది. అందుకే పగలు కూడా వేసి వుండే ఆఫీసులైట్లు ఆర్పేయవల్సి వచ్చింది.

“ఏమైందిరా... ఏమిటి సంగతి?” అన్నాను నేను.

“హరి . గోవిందమ్మ... పదివేలురా.... పదివేలు...” అన్నాడు భజగోవిందం.

ఇలా టెలిగ్రాం లాంగ్వేజీ మాట్లాడకు వివరంగా చెప్పు” అన్నాను. వాడు చెప్పేడు.

ఒక గజదొంగ ఉన్నాడు ఈ ఊళ్ళో. వాడి పేరు గంగన్న. ఎన్నో దొంగతనాలు చేసి పోలీసుల కళ్ళుకప్పి తప్పించుకు తిరుగుతున్నాడు. వాడిని పట్టిస్తే పదివేల రూపాయల బహుమానం ప్రకటించారు పోలీసువాళ్ళు. భజగోవిందం భార్య ఆ దొంగవెధవని పట్టుకుందట.

“ఎలా?” అన్నాను.

"రాత్రిపూట మా ఆవిడ నిద్రపోదు. తను వేసిన ముగ్గులు ఎవ్వరూ తాకకూడదని రాత్రంతా గుమ్మం దగ్గరే దుడ్డుకర్ర పుచ్చుకుని కూర్చుంటుంది. నిన్న ఆ గంగన్నగాడు ఏ లక్షాధికారి కొంపలోనో దొంగతనం చేసి, నగలమూటతో మా వీధిగుండా వెళ్తున్నాడు. మా ఇంటి ముందుకు వచ్చి చూడకుండా మా ఆవిడవేసిన ముగ్గు తొక్కాడు... అంతే... ఆవిడ కోపం తారాస్థాయికి చేరుకుంది. చేతిలో ఉన్న దుడ్డుకర్రతో వాడి మాడు పగలగొడుతూ...

"ఏ జిమ్మడ... కళ్ళు కనబడడం లేదురా... ముత్యం లాంటి నా ముత్యాలముగ్గు తొక్కుతావా?" అంది. గంగన్నగాడు దిమ్మ తిరిగి పడిపోయేడు. వాడు దొంగ అనీ వాడు దొంగతనం చేసి వస్తున్నాడనీ ఆమెకు తెలీదు. కేవలం ముగ్గు తొక్కాడన్న కోపంతో వాడిని కొట్టింది. నన్ను లేపింది. నేను వాడిని గుర్తించి పోలీసులకి కబురుచేశా. వాళ్ళొచ్చి థాంక్స్ చెప్పి వాడిని పట్టుకుపోయారు. ఈరోజు వచ్చి పదివేలూ తీసుకోమన్నారు..." అన్నాడు.

మేం అందరం వాడిని అభినందించాం.

"పార్టీ చెయ్యాలిరా..." అన్నాను.

"సారీరా... ఆ పదివేలలో పైసా కూడా మరొక రకంగా ఖర్చు చెయ్యకూడదు. ఆ సొమ్మంతో ప్రతి ఏడూ . ముగ్గుపిండి కొనడానికే ఉపయోగించాలని ఆవిడ షరతు పెట్టింది. దొంగను పట్టించినది తన ముత్యాలముగ్గేనని సంబర పడిపోయింది" అన్నాడు.

ఇక ఎక్కువ బలవంతం చెయ్యలేదు.


మా ముత్యాలవీధిలో... అంటూ ఇంకా ఏదో చెప్పబోయాడు భజగోవిందం.

మా ఆఫీసులో ఈ మధ్యే చేరిన ఒక కుర్రగుమాస్తా...

"అరె... మీ ఇల్లు ముత్యాలవీధిలోనా... ఆ వీధిలో ఎక్కడ?" అని అడిగేడు.

భజగోవిందం గొంతు సవరించుకున్నాడు.

"ఆ వీధిలోకి రండి. ప్రతి ఇంటిముందూ పెద్ద పెద్ద ముగ్గులు పెట్టివుంటాయి. ఆ ముగ్గులు అన్నీ తొక్కుకుంటూ నడవండి... ఏ ఇంటి ముందు ముగ్గు తొక్కినపుడు ఆ ఇంటావిడ పోట్లగిత్తలా రంకెలు వేస్తూ



ముగ్గు: ఆర్.తారాబాలకృష్ణ (హైదరాబాద్)

దుడ్డుకర్ర తో వాలుగు తగిలిస్తుందో అదే మా ఇల్లు... ఆ ఇంటావిడే మా శ్రీమతి..." అన్నాడు.

బెదిరిపోయాడు కుర్రగుమాస్తా.

"వద్దులెండి... కొత్తగా పెళ్ళయిన వాడిని... వడ్డినెప్పి తట్టుకోలేను. వేరే గుర్తులు చెప్పండి" అన్నాడు.

అంతా వింటున్న మా లేడీ టైపిస్టు...

"కొత్తగా పెళ్ళి కావడానికీ వడ్డివాప్పికీ ఏమిటి సంబంధం?" అంటూ కిసుక్కున నవ్వింది.

ఆమెను ప్రేమిస్తున్న మరో బ్రహ్మచారి గుమాస్తా ఆమె నవ్వినపుడు రాలిన పువ్వుల్ని ఏరుకున్నాడు.

"ఆ సంబంధం ఏమిటో నేను చెప్తాను. కొత్తగా పెళ్లి చేసుకున్న తరువాత పెళ్ళాం ముందు వడ్డివం చి ఇల్లు ఊడ్చి, అంట్లు తోమాలి కదా... 'నువ్వు ఎంతో అందంగా వున్నావు రాణీ... నేను నీ బానిసను..' అంటూ వడ్డివంచి వినయంగా మాట్లాడాలి కదా..." అన్నాడు భజగోవిందం.

కుర్రగుమాస్తా కల్పించుకుని లేడీ టైపిస్టుతో అన్నాడు.

"మీకు పెళ్ళి కాలేదు కనుక ఈ సంగతి తెలియదు. మీరు ఒకడిని కట్టుకున్నాకా... వాడికి నడ్డినొప్పి వచ్చాకా బోధపడగల్దు"

"హి...హి..." అన్నాడు భజగోవిందం.

"వద్దు భజగోవిందం! ఆ పారపళ్ళు చూపించకు" అన్నాను.

"వేరే గుర్తులు చెప్పండి" మళ్ళీ అన్నాడు ఆ కుర్రగుమాస్తా.

"ఏ ఇంటి ముందు పెద్ద పెద్ద ముగ్గులుండునో... ఏ ఇంటిముందు ముగ్గులు అత్యధిక సంఖ్యలో వుండునో... ఏ ఇంటి ముందు ఒక ఇల్లాలు అనుక్షణమూ ఆ ముగ్గులకు కాపలా వుండునో... అదే మా గృహము..." అన్నాడు భజగోవిందం.

ఆ మర్నాడు భజగోవిందం ఒక వారపత్రిక పట్టుకువచ్చాడు ఆఫీసుకు.

"ఆఫీసులో ఇలాంటి పుస్తకాలు చూస్తే మన బాస్ హత్య చేసి పారేస్తాడు... ఇలాంటి హత్యకేసులోనే ఒకసారి మన మొగుడు జైలుకు వెళ్ళాడు. ఆ విషయం తెలిసీ నువ్వు ఈ సాహసం చేస్తున్నావంటే నీకు నూకలు చెల్లిపోయినట్లే..." అన్నాను.

"నూకలా... అవున్రా... ఈసారి కొన్న బియ్యంలో సగానికి పైగా నూకలే వున్నాయి. ఏం చెయ్యాలా అని మా ఆవిడ అఘోరిస్తుంటే మరికొంచెం ఆడించి 'ఉప్పుపిండి' చెయ్యమన్నార్రా..." అన్నాడు భజగోవిందం.

"ఆ పుస్తకం ఎందుకు తెచ్చావ్?" కోపంగా అరిచాను. ఆ అరుపుకు అంతవరకూ సీట్లో నిద్రపోతూ గుర్రు కొడుతున్న ఒక గుమాస్తా లేచి కూర్చున్నాడు.

"ఇందులో మా ఆవిడ కవిత పడింది... చూపించాలని తెచ్చాను..." అన్నాడు.

"ఆహా... ముగ్గులేకాక.... కవితలు కూడానా?" అన్నాను.

"ఆ కవిత కూడా ముగ్గులమీదే... చదువు..." అంటూ పుస్తకం తెరిచి ఆ పేజీ చూపించాడు. చదివాను...

"అందమైన ముగ్గులు...
ఆనందకరం ముగ్గులు...
చిన్నదాని సిగ్గులు...
నిశ్శబ్దంలో దగ్గులు...
మగవాడికి పెగ్గులు...
తెల్లరంగు బొగ్గులు...
నటుడి నెత్తి విగ్గులు
వంటింట్లో జగ్గులు...

చలికాలం గగ్గులు...
అందమైన ముగ్గులు...
ఆనందకరం ముగ్గులు...

"బావుంది..." అంటూ ఇక అక్కడ ఉండలేక "టాయ్‌లెట్'లోకి వెళ్ళి భళ్ళున వాంతి చేసుకుని వచ్చాను.

"ఎక్కడికిరా అలా మధ్యలో వెళ్లిపోయావు?" అన్నాడు భజగోవిందం.

చెప్పలేదు కానీ...

"ఇంకెవరికయినా ఛూపించావా?" అడిగేను. లేదన్నాడు.

"చూపించకు... అందరూ సడన్‌గా సి.ఎల్. పెట్టడం బాగోదు. నాకు కడుపులో దేవుతోంది... సి.ఎల్. పెట్టి కొంపకు పోతున్నాను. మన ఆఫీసులో అందరూ ఈ కవిత చదివితీరాలన్న కోరిక నీకు వుంటే రోజుకొక్కరికి చొప్పున చూపించు... వస్తాను..." అంటూ సి.ఎల్. పెట్టి వచ్చేశాను.

ఆ మర్నాడు వాడు బాధపడిపోయేదు.

"అదేమిట్రా... పాపం... మా ఆవిడ బాగానే రాసింది కదా కవిత... నాకేం పాదుగా తోచలేదు" అన్నాడు.

"చేపలు అమ్ముకునేవాడికి చేపల కంపు తెలీదు... నన్నిలా కొన్నిరోజులు మినపకుదుంలా బలంగా బతకనీ..." అన్నాడు.

ఒకరోజు మా ఆఫీసర్‌గారి పనిమీద ఆఫీసుజీపు తీసుకుని వెళ్ళాను. నేనే డ్రైవ్ చేస్తున్నాను. అనుకోకుండా ఒక కుర్రవాడు అడ్డువచ్చాడు. సడన్ బ్రేక్ వేశాను. ఆ కుర్రవాడికి స్వల్పమైన గాయాలు తగిలాయి. అక్కడే వున్న పోలీస్ వచ్చి స్టేషన్‌కు పదమన్నాడు. ఆ కుర్రవాడిని జీపులో కూర్చోపెట్టుకుని పోలీసుతో సహా స్టేషన్‌కెళ్ళాను.


ఇన్‌స్పెక్టర్ కేసు పెడతానన్నాడు.

"చిన్న ప్రమాదం — ఆ కుర్రవాడికీ ఏం కాలేదు... కుర్రవాడిదే తప్పు. అతనూ ఒప్పుకున్నాడు. వదిలెయ్యండిసార్" అన్నాను.

ఆ కుర్రవాడు కూడా అదే అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ మాత్రం బిగుసుకుపోయాడు. ఎంతగా బిగుసుకు పోయాడంటే ఆ బిగుతుకి అతని చొక్కా గుండీలు 'పుట్' అన్నాయి.

నెమ్మదిగా అతని చెవిలో


ముగ్గు: కె.రాజ్యలక్ష్మి (రేపల్లె)

తాంబూలం ఇచ్చుకుంటానన్నాను. లేకపోతే ఎవడు పడతాడు బాధలు? ఆయన ముఖం చేటంతయ్యింది.

"ఒక లారీడు ముగ్గు పిండి ఇయ్యాలి. అలా అయితే వదిలేస్తాను" అన్నాడు.

ఆశ్చర్యపోయాను. ఆ ఆశ్చర్యం గమనించాడు కాబోలు...

నేను అడిగితే ఏ దుకాణం వాడయినా ఒకలారీ తోలిస్తాడు ఇంటికి. కానీ ఊళ్లోవున్న ముగ్గు అంతా ఎవరో కొనేశారట. మా ఆవిడ నన్ను రోజూ తిడుతోంది. ఇంత పేద్ద ఇనస్పెక్టరై లారీడు ముగ్గు సంపాదించలేకపోయారని.

ఆ పని మీరు చేస్తే వదిలేస్తాను మిమ్మల్నీ.." అన్నాడు. పదివేలు వచ్చాయని మా భజగోవిందంగాడి పెళ్లాం ఊళ్లో స్టాకంతా కొనేసి వుండొచ్చు.

"ఏంసార్.. మీ ఆవిడక్కూడా ముగ్గులపిచ్చా?" అన్నాను. అవునట.

వెంటనే ఫోనుచేసి భజగోవిందాన్ని స్టేషన్‌కి పిలిపించాను.

"హరిగోవిందం... నువ్విక్కడ... నాకు అంతా అయోమయంగా వుంది.." అన్నాడు.

జరిగిందంతా చెప్పివాడు నన్ను ఎలా ఆదుకోగలడో చెప్పాను.

"నీకు చాలాసార్లు అప్పులు ఇచ్చి ఆదుకున్నాను.ఇపుడు నువ్వు మీదగ్గరవున్న స్టాకులోంచి ఒక లారీడు ముగ్గుపిండి ఇనస్పెక్టర్‌గారింటికి తరలించు. ఆ ఖర్చు నేను ఇస్తాను. ఈ చిక్కులోంచి నన్ను ఆదుకో.." అన్నాను. వాడు ఆలోచించసాగేడు. అందుకే నాకు ఒళ్లు మండింది.

ఎందుకురా అంత ఆలోచన... అడిగిన వెంటనే సహాయం చేస్తావనుకున్నామురా పింజారిపీనుగా... కృతఘ్నుడా... తల్లిపాలు తాగి రొమ్ముగుద్దే రకంలా మిత్రుడిదగ్గర అప్పులు తీసుకుని వాడిని బొక్కలో తోయిస్తావురా... వెధవా..."అంటూ చడామడా తిట్టాను.

ఆ తిట్లకు చలించాడు.

"మీ అడ్రస్సు చెప్పండి... లారీడు ముగ్గు మీ ఇంటికి చేర్చిఅలా చేర్చినట్లు మీ ఆవిడచేత సంతకం చేయించుకువస్తాను. ఆ కాగితం చూసి మావాడిని వదలండి.." అంటూ అడ్రస్సు తీసుకుని వెళ్లిపోయాడు.

ఆ సాయంత్రానికి నాకు విముక్తి దొరికింది.

లారీ ముగ్గుపిండికి అయ్యిన ఖర్చునేను ఇయ్యబోతుంటే వాడు తీసుకోలేదు.

"ఇది మిత్రధర్మం..." అన్నాడు. ఆశ్చర్యపోయాను.

"భజగోవిందం... నిన్ను అనవసరంగా తిట్టాను. క్షమించు" అన్నాను.

"ఫర్వాలేదు హరిగోవిందం.. సముద్రం అన్నాకా కెరటాలు తప్పవు... జీవితం అన్నాకా అపార్థాలూ తప్పవు" అన్నాడు.

వాడిబొంద... వాడికంత జ్ఞానం ఎక్కడిది? నిన్నరాత్రి ఏ నవల్లోనో చదివిన డైలాగు గుర్తువచ్చివుంటుంది.

సంక్రాంతి పండుగ వచ్చేసింది.

పెద్దపండుగరోజున బ్రహ్మచారిని కదా అని నన్ను వాళ్లింటికి భోజనానికి పిలిచాడు భజగోవిందం. వడ్డించేముందు భార్యను అడిగేడు.

"ఈవేళ స్పెషల్స్ ఏమిటోయ్?"

"గుమ్మడికాయ... పొట్లపాదు..."అంది ఆమె.

గుమ్మడికాయ కూర చేసింది కాబోలు.. మరి పొట్లపాదు?..

"అదేమిటి?" అన్నాడు.

"అవే ఈ రోజు నేను మేసిన

ముగ్గుల పేర్లు గుమ్మడికాయ.. పొట్లపాదు... కొబ్బరిబొండాలు.. మల్లెతీగ..''అంటూ ఏమిటో చెప్పుకుపోతోంది ఆమె.

'నా(శార్ధం.. నాపిండాకుడు..''అంటూ గొణుక్కున్నాడు భజగోవిందం.

వీడు వంటకాలగురించి అడిగితే ఆమె ముగ్గులగురించి చెప్తోంది.

ఆమె వడ్డించింది. వంకాయ వేపుడు... ఊరగాయ... చారు..,

''ఇదేవిటే.. పండగపూటా..' కొంచెం చిన్న బుచ్చుకున్నాడు భజగోవిందం. పక్కన నేను వుండటంతో మరింత సిగ్గుపడిపోయేడు.

''వంటచేసే ఓపిక లేదండీ.. ఏదో ఆ మాత్రం చేసాను సంతోషించండి. ఈ ముగ్గులు వేసివేసి ఎక్కడలేని అలసటా వస్తోంది. ఇంకా వంటకూడానా?'' అంది ఆమె.

మాట్లాడకుండా భోజనం చేసాం. బయటకు వచ్చాకా 'సారీరా...' అన్నాడు.

''భలేవాడివే... నువ్వు పెట్టబోయే పిండివంటలకోసం రాలేదు నేను నీతో సరదాగా భోజనం చెయ్యడమే కావాలి నాకు... ఆఖరికి పచ్చగడ్డి పచ్చడితోనైనా సరే...''

వాడు గబుక్కున నానోరు మూశాడు.

''గడ్డితో పచ్చడి చేయవచ్చన్న ఆలోచన మా ఆవిడకు రాలేదు. నీ మాట వింటే రేపట్నుంచి నాకు గడ్డిపచ్చడే.. మాట్లాడకు...'' అన్నాడు.

కనుమ పండగనాడు ఇంటిముందు రథం ముగ్గువేస్తారట... ఎవరు ఎంతపెద్దముగ్గువేస్తే అంత గొప్పట.

ఆ మర్నాడు భజగోవిందం ఆఫీసుకి ఏడుస్తూ వచ్చాడు.

విన్నరాత్రి అలా రథం ముగ్గులేసుకుంటూ మరింత దూరం వెళ్లిపోయిన వాళ్లావిడ ఇంకా కొంపకి రాలేదట. అందుకే బెంగ పెట్టుకుని ఏడుస్తున్నాడు.

''మరి ఏం చేశావు?'' అన్నాను.

''ఏడుస్తూ కూర్చున్నాను.'' అన్నాడు.

''నీ బొంద.. పద.. పోలీసు స్టేషన్‌కి వెళ్లి రిపోర్టుఇద్దాం...'' అంటూ పర్మిషన్ తీసుకుని వాడితో బయటపడ్డాను.

పోలీసుస్టేషన్లో ఆ ఇనస్పెక్టరే వున్నాడు... వాడగ్గర లారీడు ముగ్గు లంచంగా తీసుకున్న ఆ ఇనస్పెక్టర్‌తో విషయం అంతా చెప్పాం.

'హ..హ..హ..'అంటూ నవ్వాడు ఆయన. నాకు కోపం వచ్చింది. పాపం మా భజగోవిందంగాడు కష్టంలో వుంటే ఆయన నవ్వడం ఏమిటి?

''ఇదేం బాగోలేదుసార్..'' అన్నాను. ఆయన ఆ సమయంలో నవ్వు పట్టుపడుతున్నాడు.

''ఏదీ నేనిలా నవ్వు తీసుకోవడమా?'' అన్నాడు.

ఆయన నవ్వు తీసుకుంటే నాకేం.. విషం తీసుకుంటే నాకేం?

''అదికాదు... మేం బాధలో వుంటే మీరు నవ్వడం..'' అన్నాను.

''చూడుబాబూ... విన్నరాత్రి రథం ముగ్గువేస్తూ మా ఆవిడ కూడా వెళ్లిపోయింది. ఇంతవరకూ రాలేదు. అయినా నేను కంగారు పడుతున్నానా?'' అన్నాడు ఆయన.

నాకు ఆశ్చర్యం వేసింది.

''అవును. నిజమే చెప్తున్నాను. అలా ముగ్గులు వేసుకుంటూ పోయిన మా ఆవిడా.. వీళ్లావిడా ఎక్కడో అక్కడ కలుసుకోక మానరు. ఇద్దరూ తిరిగి ఈ ఊరు రాకపోరు. గాభరా పడకండి.. ఒక రెండురోజులు ఆగి చూద్దాం...'' అన్నాడు ఇనస్పెక్టరు.


''సరే.. పద'' అన్నాను భజగోవిందంతో.

ఇద్దరం కల్సి వచ్చేశాం.


రిపోర్టు చేసిన తర్వాత ఇది రెండోరోజు... న్యాయంగా ఈ సాయంత్రానికి భజగోవిందం భార్య ఇల్లు చేరుకోవాలి.

చూద్దాం.. ఆమె ఈరోజు వస్తుందో రాదో.

*



ముగ్గు: కె.సూర్యలత (సికింద్రాబాద్)



ముగ్గు: డి. విజయదుర్గ (హైదరాబాద్)